జంగమయ్యా.. లోకమంతా నీవేనయ్యా

కనుల పండువగా మహా శివరాత్రి వేడుకలు


మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయంలో సుందరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రంగరాజన్


చేవెళ్ల: లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పూజలు


చేవెళ్ల: లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పల్లకి సేవ


మొయినాబాద్: శ్రీరాంనగర్‌లో శివపార్వతుల కల్యాణోత్సవం


మొయినాబాద్ రూరల్: లోటస్ టెంపుల్‌లో..


చేవెళ్ల: కొనగట్టు శివాలయంలో..

- భక్తజన సంద్రంగా మారిన ఆలయాలు
- మార్మోగిన శివ నామస్మరణ

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చేవెళ్ల లక్ష్మీవేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాద్‌నగర్ ఉత్తర రామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శివలింగానికి అభిషేకాలు చేశారు. పలువులు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఉదయాన్నే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో కల్యాణోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివ నామస్మరణతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

– చేవెళ్ల, షాద్‌నగర్ జోన్ బృందం


షాద్‌నగర్: ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు


షాద్‌నగర్‌రూరల్: రామలింగేశ్వర స్వామి పూజలో శ్రీవర్ధన్‌రెడ్డి


షాబాద్: ముద్దెంగూడలో భక్తుల పూజలు


చేవెళ్ల: శివాలయంలో భక్తుల క్యూ..


నందిగామ: వెంకటగిరి కొండపై భక్తుల పూజలు


పండ్లు పంపిణీ చేస్తున్న భగత్‌సింగ్ యూత్ సభ్యులు

క్లుప్తంగా

నేడు మల్లన్న కల్యాణం

షాబాద్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ పంచాయితీకి అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో ఆదివారం మల్లన్న కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ సులోచన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 12గంటలకు బోనాల ఊరేగింపు, మధ్యాహ్నం కల్యాణం, సాయంత్రం ఎడ్ల బండ్ల తిరుగుడు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఉత్సవాలకు సీఐ గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న సత్తిరెడ్డి

షాబాద్: మండల పరిధిలోని మాచన్‌పల్లిలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మోముల ప్రమీలసత్తిరెడ్డి రూ.30వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవ చింతన అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాచన్‌పల్లి సర్పంచ్ మహేదర్‌రెడ్డి, రమేశ్, రామస్వామిగౌడ్, పాండుగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో శేఖర్‌ది చురుకైన పాత్ర

యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్


శేఖర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారుడు పాపకంటి శేఖర్ పాత్ర మరువలేనిదని యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం యువ సత్తా యూత్ ఆధ్వర్యంలో పాపకంటి శేఖర్ 10వ వర్ధంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ముఖ్య కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. శేఖర్ గజ్జకట్టి పాట పాడి మలిదశ ఉద్యమానికి ఊపిరి పోశాడన్నారు. ఈ కార్యక్రమంలో యువ సత్తా యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం క్షేత్రంలోని శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను శనివారం రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోన శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ సరిత పంతునాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంటసామగ్రి బహూకరణ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి రూ.1.5 లక్షల విలువైన వంటసామగ్రిని బహూకరించారు. దేవాలయంలో గోలి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వంటసామగ్రిని అందించారు. శ్రీనివాస్‌రెడ్డి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్యరాములు, యువజన సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి రవి, మహిళా సంఘం అధ్యక్షురాలు అప్పం అలివేలు, నాయకులు చెర్కురవి, శ్రీను, నర్సింహ, జగదీశ్వర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కడ్తాల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 22 నుంచి 28 వరకు మేకలు, గొర్రెల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి భానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 22న ముద్విన్, చల్లంపల్లి, రావిచేడ్, కడ్తాల్‌లో నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రారంభమవుతుందని.. జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఆర్డీఓ రాజేశ్వరి


పల్లకీ సేవలో పాల్గొన్న ఆర్డీఓ రాజేశ్వరి దంపతులు, భక్తులు

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతోందని ఆర్డీఓ రాజేశ్వరి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం పల్లకీ సేవ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో ఆర్డీఓ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రఘుపతిరావు, ప్రమోద్, కృష్ణ, కౌన్సిలర్ పులిమామిడి లత, ప్రకాష్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్, రఘుగౌడ్, నారాయణ, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, సత్తయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మార్చి 7వరకు హస్తకళా మేళా


మేళాను ప్రారంభిస్తున్న సీఐ నవీన్‌కుమార్

షాద్‌నగర్: చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించాలని పట్టణ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కళాభారతి హ్యాండ్ క్రాఫ్ట్, హ్యాండ్ లూమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత హస్త కళా మేళా ఏర్పాటు చేశారు. ఈ మేళాను శనివారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత, హస్తకళలు శ్రమైఖ్య జీవన సౌందర్యానికి ప్రతీకలు అన్నారు. కళాకారులు తయారు చేసిన పోచంపల్లి, కలంకారి, ఖాదీ, మంగళగిరి, గద్వాల్, తదితర చేనేత వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, మైసూర్ రోజ్‌వుడ్, కళాత్మక ఆభరణాలు బంజారా వంటి హస్త కళల ఉత్పత్తులు ఎంతో బాగున్నాయన్నారు. ఈ హస్త కళా మేళా మార్చి 7 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు సత్యనారాయణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో శివాజీ శోభాయాత్ర


కాగడాల ప్రదర్శనలో శివాజీ అభిమానులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో శనివారం సాయంత్రం శివాజీ పరివార్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో శోభాయాత్ర, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి పట్టణంలోని అన్ని కాలనీల్లో శోభాయాత్ర, కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, శివాజీ పరివార్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిరంజన్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహప్రముఖ్ శివాజీ, శివాజీ పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

వ్యక్తి మృతి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామం వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆమనగల్లు ఎస్‌ఐ సుందరయ్య కథనం ప్రకారం వివరాలు.. హైదరాబాద్ నగరం వినయ్‌నగర్ కాలనీకి చెందిన మాణిక్‌రెడ్డి(60) శుక్రవారం ఉదయం బైక్‌పై నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా విఠాయిపల్లి గ్రామ సమీపంలో వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు అభిజీత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మాణిక్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

రాజేంద్రనగర్: ఇంటి తాళాలు పగులగొట్టి 12 తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి వస్తువులు, రూ.4 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. డీఐ పవన్‌కుమార్ తెలిపిన మేరకు.. కిస్మత్‌పూర్ ఓంనగర్ ప్రాంతానికి చెందిన పి.రాజేశ్వర్, కల్పన భార్యాభర్తలు. కల్పన ఈ నెల 15వ తేదీన ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి నర్కూడ ప్రాంతంలోని ఆమె పుట్టింటికి వెళ్లింది. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్థానికులు కల్పనకు ఫోన్ చేసి గేట్‌కు తాళం వేసి ఉందని, ఇంటి డోర్ మాత్రం తెరిచి ఉందని చెప్పారు. దీంతో కల్పన తన సోదరుడితో కలిసి నివాసానికి చేరుకుంది. లోపలికి వెళ్లి చూడగా అల్మారాలో భద్రపరిచిన 12 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నాలుగు లక్షల రూపాయల నగదు కనిపించలేదు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఓంనగర్‌తో పాటు ప్రధాన రహదారిపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: ఆయుష్మాన్ భారత్ యోజన పథకం నుంచి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో ఈ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఈ పథకంలో అర్హులుగా ఉండేందుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంనగర్ సర్పంచ్ నస్వల్లి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, నాయకులు మహిపాల్, మాధవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మేన్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం: చేవెళ్ల ఎంపీపీ


క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ శైలజ తదితరులు

చేవెళ్ల: క్రీడలతో ఒత్తిడిని జయించవచ్చునని చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని దేవుని ఎరవల్లి స్టేజీ సమీపంలో చేవెళ్లకు చెందిన అనంత్‌రెడ్డి మినీ క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేశారు. ఈ గ్రౌండ్‌ను శనివారం సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ హయ్యూమ్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం అత్తెల్లి శేఖర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిరంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతకు కావాల్సిన గ్రౌండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన అనంత్‌రెడ్డిని అభినందించారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమత, నాయకులు ఆగిరెడ్డి, రాంరెడ్డి, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

జాతీయ యువ మోర్చా కోశాధికారి సాయిప్రసాద్


మాట్లాడుతున్న సాయిప్రసాద్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ వై.శ్రీధర్ అధ్యక్షతన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ అసెంబ్లీ ప్రభారి జాతీయ యువ మోర్చా కోశాధికారి సాయిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు వి.జగదీష్, ఈ.శివకుమార్, ఎస్.అరుణ్‌కుమార్, కె.లక్ష్మణ్, సహాశక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఈ.వేణుగోపాల్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.సదానంద్ తదితరులు పాల్గొన్నారు.